నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 30 ఏప్రిల్ 2024 | VIKARABAD

## క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి

**బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

**తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో రోడ్‌షో**



తుర్కయంజాల్ : రోడ్డు షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, చిత్రంలో అభ్యర్థి క్యామ మల్లేశ్

తుర్కయాంజాల్/అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 29 : బడుగు, బలహీన వర్గాల వ్యక్తి, నిత్యం ప్రజల్లో ఉండే క్యామ మల్లేశ్‌ను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. అలవి కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఐదు నెలలు దాటినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని.. మరోసారి మోసపోవద్దని ప్రజ లు, బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. బీఆర్ఎస్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే రేవంత్ ప్రభుత్వంతో పోరాడి సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగేలా చూస్తామన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వచ్చి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. మరోమారు కాంగ్రెస్ నాయకుల మాయమాటలను నమ్మి ఇబ్బందిపడొద్దని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, కౌన్సిలర్లు, కల్యాణ్‌నాయక్, జ్యోతి, తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, అశోక్, రాజీరెడ్డి, సంపతీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అబ్దుల్లాపూర్ మెట్‌లో..**

అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు మాసాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం బయటపడిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేండ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు దండెం రాంరెడ్డి, జక్క రాంరెడ్డి, విఠల్‌రెడ్డి, పూజారి చక్రవర్తిగౌడ్, ప్రవీణ్‌కుమార్, భాస్కర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్, ప్రధానకార్యదర్శి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కిరణ్‌కుమార్‌గౌడ్, రంగయ్య, మల్లేశ్, రాధాకృష్ణ, యాదయ్య, ఎంపీటీసీలు సాయికుమార్‌గౌడ్, యాదగిరి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.




తుర్కయంజాల్ రోడ్డు షోకు హాజరైన ప్రజానీకం

## 1950కు ఫిర్యాదు చేయండి

**ఎన్నికల ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

రంగారెడ్డి, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ) : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ శశాంక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1950కు ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని, రిజిస్టర్ ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు రికార్డ్ చేస్తారని తెలిపారు. జిల్లా ప్రజలు చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో కష్టాలపాలు



పరిగి మండలంలోని మాదారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



బషీరాబాద్ మండలంలోని మైల్వార్ గ్రామంలో మద్దతు తెలుపుతున్న మహిళలు

- మరోసారి కాంగ్రెస్ నమ్మితే మరిన్ని కష్టాలు కొని తెచ్చుకున్నట్లే..
- ఇచ్చిన హామీలను విస్మరించిన హస్తం పార్టీకి బుద్ధి చెప్పాలి
- తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష
- బీఆర్ఎస్ హయాంలో పథకాలు అందని ఇల్లు లేదు
- కాంగ్రెస్ రాగానే కరెంట్ కష్టాలు వచ్చాయి
- పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 29 : కాంగ్రెస్ పాలనలో ప్రజలు కష్టాలపాలవుతున్నారని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం పరిగి మండలం బసిరెడ్డిపల్లి, మాదారం గ్రామాల్లో చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటేసి కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల హామీలను నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను దూరం చేసుకోవడం వల్లే ఈ కష్టాలు వచ్చాయని ప్రజలు భావిస్తున్నారన్నారు. కేసీఆర్ హయాంలో ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. రైతుభరోసా కింద పెట్టుబడి సాయం ఎకరాకు రూ.15 వేలు ఇంకా ఎందుకివ్వలేదన్నారు. రూ.2లక్షలు రుణ మాఫీ, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు పింఛన్ల పెంపు, ఇంట్లో ఇద్దరు వృద్ధులుంటే భార్యాభర్తలకు పింఛన్, ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.2500 వంటి హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. నెలలు గడుస్తున్నా ఏ ఒక్క పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కొత్త నాటకానికి కాంగ్రెస్ తెర తీసిందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు, తాగునీటి కష్టాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయన్నారు. మరోసారి కాంగ్రెస్‌ను నమ్మితే మరిన్ని కష్టాలు కొని తెచ్చుకోవడమేనని.. ప్రజలు ఆలోచించి ఓటేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం అరవిందరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయకుడు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాములు, మధుసూదన్‌రెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

**హస్తం పార్టీకి గుణపాఠం చెప్పాలి : ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి**

బషీరాబాద్ : తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని నీళ్లపల్లి, మైల్వార్, దామర్‌చేడ్, బషీరాబాద్, జీవన్గి గ్రామాల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పథకాలు అందని ఇల్లు లేదన్నారు. కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, వచ్చీరాగానే కరెంట్ కష్టాలు మొదలయ్యాయన్నారు. కనీసం సరిపడా తాగునీరిచ్చే సోయి కూడా లేదని మండిపడ్డారు. గ్యారెంటీల పేరుతో ప్రజలను బోల్తా కొట్టించిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే అవకాశం వచ్చిందన్నారు. మోసపూరిత హామీలకు మరోసారి మోసపోకుండా బీఆర్ఎస్‌కు ఓటేసి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేతలకు ప్రచారానికి ఆరు గ్యారెంటీలపై నిలదీయాలన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజలను దగ్గరకు రానివ్వడని, తాండూరులో కనీసం పదిమందిని కూడా ఆయన గుర్తుపట్టరని తెలిపారు. తాండూరుకు రమ్మని పిలిచినా రాని రంజిత్‌రెడ్డి ఎన్నికలు రావడంతో కాళ్లకు చక్రాలు కట్టుకొని మరీ తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు అశోక్‌గౌతమ్, రుక్మారెడ్డి, అనంతయ్య, రాజురెడ్డి, పాండురంగారెడ్డి, ముకుంద్, గోపాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో మామిడి



**అత్యధికంగా ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లకు ఎగుమతులు**

**బాట సింగారం పండ్ల మార్కెట్‌కు రోజూ 700 నుంచి 850 వరకు లారీల రాక**

**ఇప్పటివరకు బాట సింగారానికి 45 వేల మెట్రిక్ టన్నుల సరుకు దిగుమతి**

**గతేడాది మార్కెట్ నుంచి 1.20 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఎగుమతి**

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 29 : కాలం కలిసిరాక, అకాల వర్షాలు, పూత తెగులు మొదలైన ఆటంకాలు, అడ్డంకులు ఉన్నప్పటికీ మార్కెట్లకు మామిడి కాయల దిగుమతి రోజు రోజుకూ పెరుగుతున్నది. రంగారెడ్డి జిల్లా బాట సింగారం పండ్ల మార్కెట్‌లో రికార్డు స్థాయిలో మామిడి ఎగుమతులు జరుగుతున్నాయి. మామిడి పంట చేతికి అందుతున్న సమయంలో రంగారెడ్డి జిల్లాతో పాటు పలు జిల్లాలకు చెందిన మామిడి కాయలను బాట సింగారం పండ్ల మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఈ పండ్ల మార్కెట్‌కు ప్రతి రోజూ 700 నుంచి 850 వరకు లారీలు వస్తున్నాయి. లోడుల కొద్దీ మామిడి కాయలు వస్తుండడంతో వ్యాపారం కూడా అంతే స్థాయిలో జరుగుతున్నది. ఈ పండ్ల మార్కెట్ నుంచి పెద్ద ఎత్తున ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాలకు పెద్ద ఎత్తున ఎగుమతులు జరుగుతున్నాయి. గత సంవత్సరం ఈ సీజన్‌లో బాట సింగారం పండ్ల మార్కెట్ నుంచి 1.20 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి పండ్లను ఎగుమతి చేశారు. కానీ, ఈ ఏడాది అకాల వర్షాలతో పాటు పూత తెగులు వంటి వాటి వలన మామిడి ఉత్పత్తి తగ్గినట్లు ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. అయినప్పటికీ ఈ ఏడాది బాట సింగారం పండ్ల మార్కెట్‌కు ఇప్పటివరకు 45 వేల మెట్రిక్ టన్నుల మామిడికాయలు వచ్చాయి. ఈ సీజన్ పూర్తయ్యే నాటికి 1.50 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి వచ్చే అవకాశముందని మార్కెటింగ్ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సీజన్‌లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల మామిడి వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఇందులో ఒక్క బాట సింగారం పండ్ల మార్కెట్‌కే 1.50 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశాలుండటంతో పండ్ల మార్కెట్‌లో క్రయ విక్రయాలు ఊపందుకున్నాయి. మార్కెట్ పరిసరాలు రైతులు, వ్యాపారస్తులతో మార్కెట్ కిటకిటలాడుతున్నాయి. మరోవైపు రైతులతో పాటు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ కమిటీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రైతులు తీసుకువచ్చిన మామిడికాయలపై నాలుగు శాతం మాత్రమే కమీషన్ వసూలు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులు మైకులు, బ్యానర్ల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు.

**రైతులకు గిట్టుబాటు ధర..**

బాట సింగారం పండ్ల మార్కెట్‌లో మామిడికి ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర వస్తున్నట్లు రైతులు తెలిపారు. ఒక టన్ను మామిడి కాయలకు రూ.25 వేల నుంచి రూ.65 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. నాణ్యమైన పండ్లకు గిట్టుబాటు ధరలు వస్తుండటంతో రైతులు సంతృప్తి చెందుతున్నారు. మామిడి సీజన్ ముగిసే వరకు రైతులకు నాణ్యమైన గిట్టుబాటు ధర అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే, వ్యాపారులు కొనుగోలు చేసిన మామిడిని నిల్వ ఉంచుకోవటం కోసం కోల్డ్ స్టోరేజీ సౌకర్యాన్ని కూడా అధికారులు కల్పించారు. దీంతో బాట సింగారం పండ్ల మార్కెట్‌లో మామిడి ఎగుమతుల్లో సీజన్ ముగిసే సరికి మంచి లాభాలు గడించే అవకాశాలు కూడా ఉన్నాయి.



బాట సింగారం పండ్ల మార్కెట్‌లో రాసులుగా పోసిన మామిడి కాయలు



ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు మామిడి కాయల్ని బుట్టల్లో నింపుతున్న వ్యాపారి

## తాగునీటి ఇబ్బందులు రావొద్దు

**అధికారులకు జలమండలి ఎండీ ఆదేశాలు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): తాగునీటి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో జలమండలి ఓ అండ్ ఎం అధికారులతో ఎంసీసీ (మెట్రో కస్టమర్ కేర్) ఫిర్యాదులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అధికారులు సొంతంగా ప్రణాళికలు వేసుకొని ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరా, కలుషిత నీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మరోవైపు రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఎండీ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ఎస్టీపీ పనుల పురోగతిపై ఎండీ సమీక్షించారు. ఎస్టీపీల పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. అంతర్గత రోడ్లు, లైటింగ్, గార్డెనింగ్, వాల్ పెయింటింగ్ తదితర పనుల్లో వేగం పెంచాలని చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న ఎస్టీపీల్లో కార్మికుల సంఖ్యను పెంచి పనులను పూర్తి చేసి ట్రయల్ రన్‌కు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు శ్రీధర్ బాబు, అజ్మీరా కృష్ణ, స్వామి పాల్గొన్నారు.




**ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ**

**ఉపసంహరించుకున్నది కేవలం ముగ్గురు అభ్యర్థులే**

**ఎన్నికల కోసం మూడు ఈవీఎంల వినియోగం**




# చేవెళ్ల బరిలో 43 మంది

రంగారెడ్డి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల బరిలో ఎంతమంది ఉన్నారో లెక్క తేలింది. మొత్తం 43 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే నాటికి ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్ల ను ఉపసంహరించుకున్నారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతోపాటు 19 మంది జాతీయ, రాష్ట్రీయ గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, మరో 21 మంది స్వతం త్రులు బరిలో ఉన్నారు. నామినేషన్ల స్క్రూటినీ నాటికి 46 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన గోపి రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు దూదేకుల ఇమామ్‌హుస్సేన్, మహ్మద్ చాంద్‌పాషాలు బరి నుంచి తప్పుకోవడంతో చేవెళ్ల లోక్‌సభ బరిలో 43 మంది అభ్యర్థులు మిగిలారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక సోమవారం రాజేంద్రనగర్ లోని ఆర్వో కార్యాలయంలో అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు సాధారణ పరిశీలకుడు రాజేందర్‌కుమార్ కటారియా ఈసీ మార్గదర్శ కాలను అనుసరించి అభ్యర్థుల సమక్షంలో గుర్తులను కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు.

**బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..**

కాసాని జ్ఞానేశ్వర్ – బీఆర్ఎస్
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి –బీజేపీ
గడ్డం రంజిత్‌రెడ్డి– కాంగ్రెస్

**ఒకే పేరుతో పోటీలో అభ్యర్థులు..**

చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో ఒకే పేర్లతో వివిధ పార్టీల నుంచి ఎన్నికల బరిలో నిలవడం ఆసక్తిని కలిగిస్తున్న ది. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. అయితే కర్మన్‌ఘాట్‌కు చెందిన కొండా కాంతారెడ్డి కుమారుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా ఆల్ ఇండియా బ్లాక్ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఇద్దరి పేర్లు..ఇంటి పేర్లు సైతం సేమ్ టూ సేమ్ ఉం డడం చర్చనీయాంశంగా మారింది. అలాగే కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డం రంజిత్‌రెడ్డి ఎన్నికల్లో పోటీ చేస్తుండగా.. దుండిగల్‌కు చెందిన ఆరోగ్యారెడ్డి కుమారుడు రంజిత్‌రెడ్డి గాదె రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ నుంచి పోటీలో ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను పోలిన పేర్లతో ఇతర అభ్యర్థులు రంగంలో ఉండడం.. ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉన్నది.

**ఉపసంహరణపై ఆసక్తి అంతంతే..**

చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈనెల 18 నుంచి 25 వరకు చేపట్టిన నామినేషన్ల స్వీకరణలో మొత్తం 64 మంది అభ్యర్థులు 88 నామినేషన్లను దాఖలు చేశారు. ఈనెల 26న స్క్రూటినీ ప్రక్రియ పూర్తయ్యాక 18 మంది నామినేషన్లను తిరస్కరించడంతో బరి లో 46 మంది అభ్యర్థులు నిలిచారు. వీరిలో 23 మంది వివిధ జాతీయ, రాష్ట్రీయ గుర్తిం పు పొందిన పార్టీల నుంచి నామినేషన్లను దాఖలు చేయగా..మరో 23మంది స్వతంత్ర అభ్యర్థులున్నారు. ఈనెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించడంతో కేవలం ముగ్గురు అభ్యర్థులే తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీన్నిబట్టి నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అభ్యర్థులు అంతగా ఆసక్తి చూపలేదని స్పష్టమవుతున్నది. వివిధ సెగ్మెంట్ల నుంచి పోటీలో ఉన్నవారు ప్రధాన పార్టీల అభ్యర్థులకు తెలియని వారే ఉండడంతో నామినేషన్లను ఉపసంహరించుకునేలా ప్రధాన పార్టీలు సైతం ఎటువంటి ప్రయత్నం చేయలేదని తెలుస్తున్నది.

**మూడు ఈవీఎంలతో గందరగోళ మే..!**

ఈవీఎంలో 15 మంది అభ్యర్థులు, నోటాతో కలిపి మొత్తం 16 మీటలుంటాయి. ప్రస్తు తం చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల బరిలో అత్యధికంగా 43 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. దీంతో మూడు ఈవీఎంలను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నది. వాస్తవానికి ఎక్కువ ఈ వీఎం యంత్రాలుంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వృద్ధులు, నిరక్షరాస్యులు గందర గోళానికి గురయ్యే అవకాశం ఉంటుంది.

ప్రధాన పార్టీ అభ్యర్థులకు వేయాల్సిన ఓట్లు పొరపాటున స్వతంత్ర అభ్యర్థులకు వేస్తే ఫలితం తారుమయ్యే పరిస్థితి. స్వతంత్ర అభ్య ర్థులకు కేటాయించిన గుర్తులు ప్రధాన పార్టీ అభ్యర్థులకు చెందిన గుర్తులను పోలీ ఉం డడం.

.ఈవీఎంలో అభ్యర్థులు ఎక్కువగా ఉండడం వంటి ఘటనల నేపథ్యంలో గతంలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వేల సంఖ్యలో ఓట్ల ఆధిక్యం తగ్గి ఓడిపోయిన సందర్భాలున్నాయి.